క్లుప్తంగా

ఎంపీ ఆర్థిక సాయం



రేపల్లె రూరల్: పోటుమెరక గ్రామానికి చెందిన కన్నా సరస్వతీ అనే మహిళ అనారోగ్యంతో గత కొన్ని రోజులుగా బాధపడుతోంది. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.35వేల ఆర్థిక సాయాన్ని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాగితాల హనుమ ప్రసాద్ పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం



రేపల్లె: నెలలు నిండిన గర్భిణి 108 అంబులెన్స్‌లో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. పోటుమెరక పంచాయతీ బండికాయ మోటు గ్రామానికి చెందిన ఉప్పాల కల్యాణిని పురిటి నొప్పులు రావడంతో.. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో రేపల్లె వైద్యశాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మార్గ మధ్యలోనే మగ బిడ్డకు ఆమె జన్మనిచ్చింది. ఈఎంటీ మహేష్ బాబు సేవలు అందించి, సుఖ ప్రసవం జరిగేలా కృషి చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఈఎంటీ మహేష్‌బాబు, డ్రైవర్ జ్ఞాన సుందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కృష్ణకుమారి మృతి



రేపల్లె: రేపల్లె మునిసిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ దాసరి కృష్ణకుమారి(85) ఆదివారం మృతి చెందారు. అనారోగ్యంతో విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ఆమె చికిత్స పొందుతున్నారు. 1995–2000 మధ్య రేపల్లె మునిసిపాలిటీ చైర్‌పర్సన్‌గా ఆమె పనిచేశారు. ఆమెకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పలువురు ప్రముఖులు ఆమె మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

బస్టాండులో గుండెపోటుతో మహిళ మృతి



భట్టిప్రోలు: తెనాలి ఆర్టీసీ బస్టాండులో ఆదివారం బస్సు కోసం నిరీక్షిస్తూ గుండెపోటుతో ఓ మహిళ మృతి చెందింది. మండలంలోని ఐలవరం గ్రామానికి చెందిన పత్తిపాటి లక్ష్మి (50) అనారోగ్యంతో బాధపడుతుండటంతో బంధువులతో కలసి తెనాలి ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో బస్టాండులో బస్సు కోసం నిరీక్షిస్తూ.. ఒక్కసారిగా గుండెపోటు వచ్చి కుప్ప కూలిపోయింది. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బందికి అక్కడికి చేరుకుని, అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ఐలవరం తీసుకొచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బాపట్ల: బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో ఆదివారం 1990 –1993 బీఏ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. 1963లో పీయూసీ తరగతితో ప్రారంభమైన కళాశాల స్వర్ణోత్సవ సంబరాలకు ముస్తాబవుతోందని పేర్కొన్నారు. అనంతరం పూర్వ అధ్యాపకులు జి.శాంతారాం, పి.విజయ్‌కుమార్, శ్రీనివాసరాజు, ఎ.రాజ్యలక్ష్మి, ఏఎస్ఎన్ శర్మ, బి.సాంబశివరావు సన్మానించారు. పూర్వ విద్యార్థుల ఫొటోల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.ఆంజనేయులు, పూర్వ విద్యార్థులు అన్నం శ్రీనివాసరావు, ఊరు బండి వున్నారావు, అంబటి గిరిధర్, రాజేశ్వరరావు, శ్యామసుందరి, పల్లపోలు మురళీకృష్ణ, రామారావు, మణిభూషణ్, సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో ఉత్సాహంగా 'ఆలోహ'

మంగళగిరి: మండలంలోని నీరుకొండ గ్రామంలో కల ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఆదివారం ఆలోహ పేరిట ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా ముగిశాయి. యూనివర్సిటీ మనోజ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాట్యాలు, నృత్యాలు, టగ్ ఆఫ్ వార్, క్లాసికల్, వెస్ట్రన్ డ్యాన్స్, సంగీతం, క్విజ్ పోటీలలో విద్యార్థులు పాల్గొని అలరించారు. యూనివర్సిటీ మిస్, మిస్టర్‌లుగా ధృవ్ నారాయణ్ బజాజ్, వైష్ణవి కస్తూరిలు ఎంపికయ్యారు. స్టూడెంట్స్ అఫైర్స్ డైరెక్టర్ అనిల్ నిగమ్, రేవతి బాలకృష్ణన్, కౌన్సిల్ ప్రెసిడెంట్ ప్రీతమ్, వైస్ ప్రెసిడెంట్ నిరుక్తా, ప్రధాన కార్యదర్శి సంజన, కోశాధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

తొలిరోజు శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవార్ల దర్శనం

రేపల్లె రూరల్: దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా పట్టణంలోని వివిధ దేవాలయాల్లో ఆదివారం తొలిరోజు అమ్మవార్లు బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామదేవత బూరుగులమ్మకు ఉదయం నుంచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, బాల త్రిపుర సుందరిగా అలంకరించారు. రైలు పేటలోని స్వయం భూ రామలింగేశ్వరస్వామి దేవాలయం, వీరాంజనేయస్వామి ఆలయం, ఇసుక పల్లిలోని భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. 23వ వార్డులో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ తులసీ దుర్గా ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా రెల్లీ కాలనీ, బేతపూడిలో భక్తులు అమ్మవారి విగ్రహాలను నెలకొల్పి పూజలు చేశారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు


భట్టిప్రోలు: వేమవరంలో రుక్మాభాయి సహిత పాండురంగ స్వామి ఆలయంలో దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలలో భాగంగా తొలిరోజు ఆదివారం అమ్మవారికి లలిత సహస్ర నామ లక్ష్మీ అష్టోత్తర సహిత కృష్ణ అష్టోత్తర శత నామ కుంకుమ సహిత పుష్ప పూజ నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ధారా నారాయణమూర్తి శాస్త్రయుక్తంగా జరిపారు. భట్టిప్రోలు భ్రమరాంబ మల్లేశ్వరస్వామి, రాజ్యలక్ష్మి సమేత విఠలేశ్వర స్వామి, రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాల స్వామి, వెల్లటూరులోని బాలా త్రిపురసుందరీ సమేత అగస్తేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయాల్లో లలితా సహస్రనామ పఠనం, కుంకుమ పూజలు జరిగాయి. కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వాహణాధికారి దీవి వేంకటప్లాచార్యులు పర్యవేక్షించారు. స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో 105వ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు పర్యవేక్షించారు. హిందూ శ్మశాన వాటికలో కొలువైన గుండి పార్వతీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వెల్లటూరు కట్లమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిపారు. భట్టిప్రోలులో వాసవి కన్యకా పరమేశ్వరి, పార్వతీ దేవి అమ్మవార్లు ప్రత్యేక అలంకరణల్లో దర్శనమిచ్చారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా పర్యవేక్షించారు. వెల్లటూరులో అశ్వర్థన్నారాయణ మహాలక్ష్మి దేవతా వనవృక్షం ఆవరణలో అమ్మవారు బాల త్రిపుర సుందరిదేవి అలంకరనలో దర్శనమిచ్చారు.



ఇసుకపల్లిలో ప్రత్యేక పూజలందుకున్న భ్రమరాంబ



చిన పరిమిలో వనబాలగా అమ్మవారి దర్శనం



చింతమోటు కొత్త కాలనీలో శ్రీ కనకదుర్గ అమ్మవారికి పూజలు



ఆనందీశ్వరస్వామి ఆలయంలో పూజలు



దసరా ఉత్సవాల్లో నల్లమోతువారిపాలెం వాసులు



బగళాముఖి ఆలయంలో అమావాస్య హోమం



పెద్దింటమ్మకు సారె సమర్పించిన గొడపాలెం మహిళలు

ఘనంగా అమావాస్య హోమం

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శనివారం రాత్రి 56వ అమావాస్య హోమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ అమావాస్య హోమం 56 నెలలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అమ్మవారిని పసుపు కొమ్ములతో పాటు సిందూరంతో ప్రత్యేకంగా అలంకరించడం జరిగిందని తెలిపారు. భక్తులకు మోపిదేవి శ్రీనివాసరావు దంపతులు ప్రసాదాలను అందజేసినట్లు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గబళాముఖ అమ్మవారి ఆలయంలో ఆదివారం శరన్నవరాత్రి మహోత్సవాలను ప్రారంభించారు. ఈ మహా గణపతికి అర్చన చేసి అఖండ జ్యోతిని వెలిగించి, అమ్మవారికి పంచామృత అభిషేకం జరిపించారు. బాల త్రిపుర సుందరితో కలిసి బాల బండ్లమ్మగా అమ్మవారిని అలంకరించారు. క్షేత్ర పాలకుడైన పోతురాజు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు బుడ్డా వెంకటలక్ష్మి పాల్గొని ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, బాపట్ల ఎమ్మెల్యేగా కోన రఘుపతిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు.



బాల త్రిపుర సుందరి అలంకరణలో బండ్లమ్మ దర్శనం



రేపల్లె ఓల్డ్ టౌన్‌లో బాల త్రిపుర సుందరిదేవిగా బూరుగులమ్మ దర్శనం

వైభవంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు

చెరుకుపల్లి: శ్రీ గంగాంబికా సమేత ఆనందీశ్వర స్వామి దేవస్థానంలో 47వ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రాంభమయ్యాయి. ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యన్నారయణ, చైర్మన్ ఓగిరాల వీరాస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీ బాల త్రిపుర సుదరిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. మనోజ్, అఖిలాండేశ్వరి దంపతులు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహక వచనం, అఖండ స్థాపన, కలశ స్థాపన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, స్వామివారికి మహన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చక స్వామి ప్రయాగ రాంబాబు, జంజనం హేమ శంకరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రులు

కర్లపాలెం: మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అమ్మవార్లు శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా పూజలందుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి విగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వనబాలగా పార్వతీ దేవి

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చిన పరిమిలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో పార్వతీదేవి వనబాలగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అఖండ దీపారాధన, కలశారాధన చేశారు. పూజా కార్యక్రమాలను మామిళ్లపల్లి శ్రీనివాసరావు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

పెద్దింటమ్మకు సారె సమర్పణ

కర్లపాలెం: గ్రామదేవత పెద్దింటమ్మకు పేరలి పంచాయతీ గొడపాలెం మహిళలు ఆదివారం సారె, పూలు, పండ్లు సమర్పించి పూజలు చేశారు. మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా పేరలి గ్రామంలోని పేరిలమ్మ ఆలయానికి చేరుకుని, సారె సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దింటమ్మ ఆలయానికి వచ్చి సారె సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా బతుకమ్మ పూజలు

రేపల్లె రూరల్: దేవీ శరన్నవ రాత్రి వేడుకల్లో భాగంగా ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో స్వయం భూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం బతుకమ్మ పూజలు నిర్వహించారు. పుష్పాలతో అమ్మవారి వెండి ప్రతిమను అలంకరించి, అమ్మవారికి సంఘ మాజీ అధ్యక్షురాలు మెడతాటి అన్నపూర్ణ ఇంటి నుంచి పుర వీధుల్లో మహిళలు ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో ప్రతిమను నెలకొల్పారు. కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు బొలిశెట్టి లక్ష్మీతాయారు, సెక్రటరీ చుండూరు అనుహ్య, ట్రెజరర్ ఆలపాటి శైలజ, సంఘ గౌరవ అధ్యక్షురాలు పొన్నూరు రామకుమారి, సంఘ సభ్యులు మెడతాటి అన్నపూర్ణ, చుండూరి ఇందుమతి, అంకిశెట్టి సుశీల పాల్గొన్నారు.

అమ్మవారి వేషధారణలో చిన్నారులు

బాపట్ల: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో లలితా త్రిపురసుందరి పీఠం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించారు. బాల త్రిపుర సుందరి దేవి అలంకరణ గావించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. బాల పూజలో 15 మంది చిన్నారులు అమ్మవారి వేషధారణలో అలరించారు. పీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు అమ్మవారి మహత్యాన్ని వివరించారు. ఉదయం కలశ స్థాపన, కుంకుమార్చన జరిపారు. పంగులూరి కౌండిన్య శర్మ, ప్రశాంత్, వక్కలగడ్డ బాలాజీ భక్తులు పాల్గొన్నారు.



ఘనంగా పోలాశమ్మ జాతర

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమి గ్రామంలో ఆదివారం గ్రామ దేవత పోలాశమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత మన్నె వంశస్తుల ఆడపడుచు, ఆవుతు వంశస్తుల కోడలు కావడంతో ఇరు కుటుంబాల వారు అమ్మవారికి పసుపు, కుంకుమ, ఒడిగంటి బియ్యం సమర్పించారు. ఆ బియ్యంతో అమ్మవారికి పొంగలి చేసి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం గంగానమ్మ తల్లి వద్దకు వెళ్లి నైవేద్యం పెట్టారు. అమ్మవారి ప్రభకు మేళ తాళాలు, కనక తప్పెట్లతో గ్రామోత్సవం జరిపారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు అలంకరింపజేశారు.



పెద పులివర్రులో ప్రత్యేక అలంకరణలో గోగులమ్మ



రేపల్లె పుర వీధుల్లో ఆర్యవైశ్య మహిళల ఊరేగింపు



చిన పరిమిలో కొలువైన శ్రీ పోలాశమ్మ

అబ్దుల్ కలాం ఆశయాలు ఆదర్శం



కలాం విగ్రహానికి కాంగ్రెస్ నేతల నివాళి



కర్లపాలెంలో అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళి



అబ్దుల్ కలాం చిత్రపటానికి సీఐ నజీర్ బేగ్ నివాళి

బాపట్ల అర్బన్: భావితరాలు భారత మాజీ రాష్ట్రపతి, డాక్టరు ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని, ముందుకు పోవాలని కాంగ్రెస్ పార్టీ బాపట్ల ఇన్‌చార్జి గంటా అంజిబాబు పేర్కొన్నారు. స్థానిక త్రవ్వ కాలవ వద్ద కలాం జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అంజిబాబు మాట్లాడుతూ విద్యార్థులకు కలాం స్ఫూర్తిదాయకమన్నారు. పార్టీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు పఠాన్ రాజేష్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం చివరి రోజుల్లో భారతదేశం కోసం ఎన్నో సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో దోనేపూడి రవి, నక్కల రాంబాబు, గాంధీ, శీలం సాగర్, తాజుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ అబ్దుల్ కలాం

కర్లపాలెం: భారతదేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందంజలో నిలిపిన మహోన్నతమైన వ్యక్తి శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు అన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆదివారం తహసీల్దారు కార్యాలయంలోని కలాం విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి ఆయన నివాళులురించారు. కర్లపాలెం ఉప సర్పంచ్ అహ్మద్ బాషా, ఎంపీటీసీలు ఆసిఫ్ అలీ, అమీర్ బేగ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మందపాటి పరమానందకుమార్, పీవీ సురేష్ పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత కలాం

రేపల్లె: మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం స్ఫూర్తి ప్రదాత అని పట్టణ సీఐ నజీర్ బేగ్ అన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

17న 'శ్రీ వేంకటేశ సుప్రభాత' గ్రంథావిష్కరణ

బాపట్ల: ఆచార్య అద్దంకి శ్రీనివాస్ రచించిన శ్రీ వేంకటేశ సుప్రభాత వ్యాఖ్యానం గ్రంథావిష్కరణ సభ ఈ నెల 17న జరుగుతుందని ధృతి సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు కళ్లం హరినాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. సభకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజయ్ కళ్లం పాల్గొని, గ్రంథాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. విశిష్ట అతిథిగా బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, గౌరవ అతిథులుగా వివేకా సర్వీస్ సొసైటీ కార్యదర్శి, సాహితీ విమర్శకుడు అంబటి మురళీకృష్ణ, ప్రసిద్ధ సాహితీవేత్త మెరుగుమిల్లి వెంకటేశ్వరరావు, బహు గ్రంథకర్త అంతర్వేది కృష్ణమా చార్యులు, సాహితీ వేత్త బాలాంతరపు వెంకటరమణ తదితరులు పాల్గొంటారని తెలిపారు. గ్రంథ తొలి ప్రతిని సీఏ, ధృతి కార్యదర్శి చాపల సుబ్రహ్మణ్యం అందుకుంటారని చెప్పారు. సాహిత్య అభిమానులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ఆకట్టుకున్న ఎక్స్‌పో-2023

తెనాలి: పట్టణానికి చెందిన రెయిన్‌బో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీఓ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పో–2023ను రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి అధ్యక్షుడు పావులూరి రాంబాబు ప్రారంభించారు. ఎక్స్‌పోలో తెనాలి, గుంటూరుకు చెందిన మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లు వివిధ రకాల ఉత్పత్తులను ప్రదర్శించారు. వీటిలో వెండి, వన్‌గ్రామ్, ఫ్యాషన్ ఆభరణాలు, ఆర్గానిక్ ఉత్పత్తులు, చీరలు, డ్రెస్ మెటీరియల్స్, డిష్ వాష్ ఉత్పత్తులు ఉన్నాయి. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.జీవనలత, అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, కళ్యాణి, వరలక్ష్మి, గాయత్రి, జ్యోతి, అంజుమ్, సృజన పాల్గొన్నారు.



ప్రదర్శనలో మహిళలు..

ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే గడప గడపకు..

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



పెదపల్లిలో మహిళలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

నగరం: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. గట్టువారిపాలెం, పెదపల్లి గ్రామాల్లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రోడ్లు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఎంపీ మోపిదేవికి స్థానికులు విన్నవించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. 550 గడపలు తిరిగిన మోపిదేవి వెంట.. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, సర్పంచ్ కేసన వెంకట్రామయ్య, వైఎస్ ఎంపీపీ కేసన లక్ష్మీ భ్రమరాంబ, వైఎస్సార్ సీపీ నాయకులు బెల్లంకొండ పోలేరు వెంకట్రామయ్య, వాసుమల్లి రాజా, శ్రీను, పెద్దబ్బాయి, గండు శ్రీను ఉన్నారు.